ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.18.09.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో 16 పథకాలకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీకి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
2. గ్రామా పంచాయతీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకై రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుంచి సర్వే జరుగుతోంది.
3. రాష్ట్ర వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు.
4. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఈ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

------------------------

**కృష్ణా ప్రాజెక్టులు**

కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో అదనపు నీటి వినియోగం కోసం కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 16 పథకాలకు సర్వే, ఇన్వెస్టిగేషన్, సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీకి సంబంధించి జీవో ఎం.ఎస్.నం-34 జారీ చేసింది. కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ పలు దఫాలుగా నీటిపారుదలశాఖ అధికారులు, సీనియర్ న్యాయవాదులు, సలహాదారులు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఇంజినీర్లతో చర్చించిన తర్వాత అన్ని పథకాలకు ఒకేసారి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 23 నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ ఉత్వర్వులు వెలువడ్డాయి.

డెస్క్

----------------------------

**గ్రామాల్లో మౌలిక వసతులపై సర్వే**

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న మౌలిక వసతులపై సర్వే చేసి, నివేదిక ఇవ్వాలని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. గ్రామ కార్యదర్శుల ద్వారా ఈరోజు నుంచే ఈ ప్రక్రియను ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, గ్రంథాలయం, ఆరోగ్య ఉపకేంద్రం, రైతువేదిక, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పాలసేకరణ కేంద్రం, పశువైద్య ఉపకేంద్రం, పాఠశాల భవన సముదాయం, ప్రకృతివనం, వైకుంఠధామం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, మహిళా స్వయం సహాయక సంఘాలు, వీధిదీపాలు, కుళాయిలు, బోర్లు, మురుగుకాల్వలు, లింకురోడ్లు, ఇంకుడు గుంతలు, ట్రాక్టర్ ట్రాలీలపై సమాచారం ఇవ్వాలని నిర్దేశించింది.

డెస్క్

**----------------------**

## Seva Parv-6

**వ్యవసాయం**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సేవా-సుపరిపాలనే మంత్రంగా దేశంలో పరివర్తన కోసం నిరంతరం కృషి చేస్తోంది. సేవా పర్వ్ - సీరీస్ లో భాగంగా, మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తెచ్చిన పరివర్తన, రైతులకు కల్పించిన సాధికారత పై ప్రత్యేక కథనం అందిస్తున్నాం.

**Voice పాకేజ్**

దేశ ఆర్థిక, సాంస్కృతిక రంగాలకు వెన్నెముక లాంటి వ్యవసాయ రంగం, లక్షలాది కుటుంబాలను ఉపాధి మాత్రమే కాదు. దేశ గుర్తింపుకూ చిరునామా. అమృత కాలంలోకి అడుగిడుతున్న ఈ తరుణంలో సాధికార రైతులు దేశాన్ని స్వావలంబన నుంచి ఆహార నాయకత్వానికి దిశా నిర్దేశం చేస్తున్నారు. వ్యవసాయ బడ్జెట్ 22 వేల కోట్ల రూపాయల నుంచి గత 11ఏళ్ళలో లక్షా 37 వేల కోట్ల రూపాయలకు పెరిగింది. ఎర్రకోట బురుజుల నుంచి ప్రధానమంత్రి జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రభుత్వానికి రైతులే అతిపెద్ద ప్రాధాన్యత అనీ, రైతుల ప్రయోజనాలపై ఎలాంటి రాజీ ఉండదనీ ఉద్ఘాటించారు.

**(Soundbyte ప్రధాని మోదీ )**

అందుకే, గత 11 ఏళ్ళలో ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలు 226 శాతం వరకు పెరిగాయి. రైతులకు ఆర్థిక భద్రత కల్పించడానికి చేపట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద గత ఆరేళ్ళలో మూడు లక్షల తొంభై వేల కోట్ల రూపాయలు పంపిణీ అయ్యాయి. 25 లక్షల మంది పైగా చిన్న, సన్నకారు రైతులకు, ప్రధాన మంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన కింద నెలకు 3000 రూపాయల పింఛను అందుతోంది. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం కింద రుణ పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచడంతో ఇంతవరకు 10 లక్షల కోట్ల రూపాయల ఋణ వితరణ జరిగింది. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఇతర పథకాలలో PM ఫసల్ బీమా, PM కృషి సించాయి పథకాలు, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు, జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఇ-నామ్) లాంటివి ఎన్నదగినవి.

**MSL**

------------------------

**బతుకమ్మ - కొండా సురేఖ**

రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఒక జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. తొలి రోజు అయిన ఈ నెల

21న వరంగల్ వేయ్యి స్తంభాల దేవాలయంలో జరిగే సంబరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని మంత్రి అదికారులను ఆదేశించారు. వరంగల్లోని రంగలీల మైదానంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి పలు సూచనలు చేశారు. సద్దుల బతుకమ్మ పండుగ రోజు మహిళా సంఘాలతో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**పీటీసీ - వరంగల్**

---------------------------

**ఛలో జీతే హై:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాల్యంలో జరిగిన కొన్ని ఘటనల ఆధారంగా రూపొందించిన -ఛలో జీతే హై- సినిమా ను రాష్ట్రంలోని ఎంపిక చేసిన కొన్ని సినిమా హాళ్లలో ఈ రోజు నుంచి ప్రదర్శిస్తున్నారు. హైదరాబాద్ తో పాటూ, ఆర్మూరు, నిజామాబాద్, వరంగల్ పట్టణాల్లో ఈ చిత్రాన్ని ఈ నెల 24 వరకు ఉచితంగా చూడవచ్చు.

**MSL**

------------------------

**ఆర్టీసీ నోటిఫికేషన్**

ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీసీలో వెయ్యి డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నారు. వచ్చేనెల 8 నుంచి 28 వరకు దరఖాస్తు గడువు తేదీగా నిర్ణయించారు. డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్లు, శ్రామిక్ పోస్టులకు 18నుంచి 30ఏళ్ల వయసు వారు అర్హులని నోటిఫికేషన్ లో తెలియజేశారు.

**డెస్క్**

------------------------

**కరీంనగర్ పోషణ బి పడాయి బి**

కరీంనగర్ జిల్లా లో అంగన్వాడీ టీచర్లకు పోషణ బి పడాయి బి పై మూడు రోజుల శిక్షణ నిర్వహించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన శిక్షణలో హుజురాబాద్ సెక్టార్ లోని 5 మండలాల నుండి 226 మంది అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్ లు పాల్గొన్నారు

**పీటీసీ – కరీంనగర్**

------------------------

**ప్రధానమంత్రి కిసాస్ సమ్మాస్ నిధి**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా వచ్చే డబ్బులు తనకు పంట పెట్టుబడులకు ఉపయోగపడుతున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లబ్ధిదారు, సానా గణేష్ ఆకాశవాణికి తెలుపుతూ...

---------- **బైట్ గణేష్** -------

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------

**వనపర్తి స్వస్తినారీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళా ఆరోగ్య భద్రత లక్ష్యంగా శ్రీకారం చుట్టిన స్వస్తినారి-శశక్త్ పరివార్ అభ్యాన్ వనపర్తి జిల్లా మహిళలకు ఓ వరంగా భావించాలని వనపర్తి వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఆలె శ్రీనివాసులు అన్నారు. వచ్చే నెల 02 వతేది వరకు జిల్లాలోని 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిపుణులైన వైద్యులచే,90 హెల్త్ క్యాంపులలో మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు,చికిత్స అందించనున్నామని తెలిపారు.

**బైట్ : డాక్టర్ ఆలె శ్రీనివాసులు**

**పీటీసీ - వనపర్తి**

--------------------------------

**PMAY-G గడువు పొడిగింపు**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణం (PMAY-G) పథకం ద్వారా పేదల ఇండ్లకు అందించే నిధుల కోసం చేపట్టే సర్వే గడువును కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఈనెల 2 వరకు ఇచ్చిన గడువు ముగిసింది. అయితే, మన రాష్ట్రంలో సర్వే పూర్తి కాకపోవడంతో ఈ నెల 30 లోపు పూర్తి చేయాలని, ఈ గడువు పొడిగింపు తెలంగాణకు మాత్రమే వర్తిస్తుందని కేంద్రం లేఖ రాసింది. దీంతో, లబ్ధిదారుల వివరాలను కేంద్రానికి చెందిన ఆవాస్ ప్లస్ యాప్‌లో హౌసింగ్ శాఖ నమోదు చేస్తోంది. సొంత స్థలం ఉండి ఇళ్లులేని 19లక్షలకు పైగా లబ్ధిదారులను సర్వే చేయాలని హౌసింగ్ శాఖ నిర్ణయించింది.

**డెస్క్**

----------------------------

**ఆసిఫాబాద్ పోషణ మాసం**

ఆసిఫాబాద్ జిల్లాలోని 973 అంగన్ వాడీ సెంటర్లలో పోషణ మాసం రోజువారీ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025లో భాగంగా వచ్చేనెల 16వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

----------------------------

**కాజీపేట – బల్లార్ష రైళ్ల రద్దు**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని మందమర్రి - రామగుండం మధ్య 24 కిలోమీటర్ల మార్గంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి రేపు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతాయని అధికారులు తెలిపారు. దీంతో ఈరోజు, రేపు రామగిరి ఎక్స్ ప్రెస్, కాజీపేట బలార్షా ఎక్స్ ప్రెస్, పుష్ పుల్ రద్దు చేశారు. భాగ్యనగర్ ఎక్స్ ప్రెస్ సికింద్రాబాద్ - కాజీపేట మధ్య నడుస్తుంది. సింగరేణి ఎక్స్ ప్రెస్ భద్రాచలం రోడ్డు - వరంగల్ వరకు మాత్రమే నడుస్తుంది.

**పీటీసీ - మంచిర్యాల**

-----------------------

**వాతావరణం**

రాష్ట్రంలోని సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. మిగతా అన్ని జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ లో ఈరోజు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**పీఎస్**

---------------------------------